క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



గొల్లకంచరపాలెంలో ధనలక్ష్మీదేవికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కంచరపాలెం: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కంచరపాలెం, తుమ్మడపాలెం, ఆశవానిపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి ఆలయంలో ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమ పూజలు, మంగళగౌరీ వ్రతాలు నిర్వహించారు. గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

జాబ్ మేళాలో 74 మందికి ఉద్యోగాలు



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. ఐఐఎఫ్ఎల్ సంస్థ ఫైనాన్స్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఆధాస్ సొల్యూషన్స్, ఎంఎఎస్ మెరైన్ సర్వీసెస్, ట్రీనిటెక్ ఇన్ఫో ఇండియా, టీం లీజ్, బయో ఫోర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మేధా సర్వో డ్రైవ్, రిలయన్స్ డిజిటల్ పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 690 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 287 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 74 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి అనంతరం జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

మినీ జాబ్ మేళాకు స్పందన

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీఎస్ఎస్‌డీసీ, మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి మాట్లాడుతూ పట్టుదలతో సాధించలేనిది ఏమీ లేదన్నారు. జాబ్‌మేళాలో డబ్ల్యూఎన్ఎస్, ఎస్ఎన్ఎఫ్ ఫార్మా, ఫినో పేమెంట్ బ్యాంక్‌లు పాల్గొనగా, 119 మంది నిరుద్యోగులు హాజరుకాగా, 32 మంది ప్లేస్‌మెంట్ పొందారని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ కె. సాయికృష్ణ చైతన్య పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ డి అరుణపద్మ, జేకేసీ మెంటార్ వీఎస్ రాజు, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ కె. ప్రశాంతి పాల్గొన్నారు.

లలితానగర్‌లో కూలిన చెట్టు



వినాయకుడి ఆలయం వద్ద కూలిన చెట్టు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని తొండం వినాయకుడి ఆలయం వద్ద చెట్టు కూలింది. శుక్రవారం సాయంత్రం ఉన్నపళంగా చెట్టు కొమ్మ రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. చెట్టు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. చెట్ల కొమ్మలు తగిలి కేబుల్ వైర్లు తెగిపోవడంతో ప్రసారాలు నిలిచిపోయాయి. సంబంధిత సిబ్బంది వెంటనే స్పందించి చెట్ల కొమ్మలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పింఛన్‌దారుల్లో ఆనందోత్సాహం

- జోన్-5లో తొలి రోజు 78.79 శాతం పంపిణీ
- నూతన పింఛన్ల అందజేత



సీతంపేటలో అవ్వకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ రమేష్

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో శుక్రవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చురుగ్గా సాగింది. వేకువజాము 5 గంటల నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము వారి చేతిలో పెట్టారు. దీంతో పింఛన్‌దారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. 43వ వార్డులో 1,450 మంది పెన్షనర్లు ఉండగా.. 1,039 మందికి, 44వ వార్డులో 1,183 మందికి 908 మందికి పెన్షన్లు అందించారు. జీవీఎంసీ జోన్-5లో మొత్తంగా 26,529 మంది పింఛన్‌దారులు ఉండగా.. మొదటి రోజు 20,903 మందికి పెన్షన్ సొమ్ము అందజేసినట్టు జోన్-5 ఏపీడీ పద్మావతి తెలిపారు. ఒకటో తేదీన 78.79 శాతం పెన్షన్ల పంపిణీ జరిగిందని, మిగిలిన వారికి శనివారం అందజేస్తామని ఆమె చెప్పారు.



45వ వార్డులో లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న పైడి రమణ, పద్మావతి

45వ వార్డులో కొత్తగా 18 మందికి..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో నూతనంగా మంజూరైన 18 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తాటిచెట్లపాలెం దరి వాసుదేవనగర్ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి రమణ, ఏపీడీవో పద్మావతి చేతుల మీదుగా అందజేశారు. మరో 29 పింఛన్లను ఈ నెల 5న లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు, సీవో రమణి, ఆర్పీలు, పార్టీ నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, కారుకొండ రాజు, నర్సారావు, నానిబాబు, సన్ని, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

51వ వార్డులో 37 మందికి..

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో 37 మందికి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసిందని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తెలిపారు. మాధవధార కళింగనగర్‌లోని వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో నూతన లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎవరైనా లబ్ధిదారులు చనిపోతే వారి స్థానంలో ఇస్తామని చెప్పే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, ప్రాంతం, మతం, రాజకీయ పార్టీల పక్షపాతం లేకుండా పారదర్శకంగా నూతన పింఛన్లు మంజూరు చేస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలుస్తామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయం సంక్షేమ కార్యదర్శులు నందిని, స్వామినాయుడు, సంతోష్, 290 సచివాలయం అడ్మిన్ దేవుడుబాబు, పార్టీ కార్యకర్తలు శ్యామ్, వినోద్, వలంటీర్లు పాల్గొన్నారు.



51వ వార్డులో కొత్త పింఛన్లు అందిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మహారాణి పార్లర్ జంక్షన్ ఆధునికీకరణ

- నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు
- రూ.96 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీతంపేట: అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్ ఆధునికీకరణకు శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.96 లక్షల స్మార్ట్ సిటీ నిధులతో మహారాణి పార్లర్ కూడలిని ఆధునికంగా.. ఆకర్షణీయంగా, రాకపోకలకు వీలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. జంక్షన్‌లో నాలుగు వైపులా ఫుట్‌పాత్స్, టేబుల్ టాప్స్, వాటర్ ఫౌంటైన్, సెంటర్ ఐలాండ్, కేబుల్ స్టోన్ ఫ్లోరింగ్‌తో తీర్చిదిద్దుతామన్నారు. దొండపర్తి కూడలి నుంచి మహారాణి పార్లర్ వరకు 60 అడుగుల రహదారిగా.. మహారాణి పార్లర్ నుంచి హైవే వరకు 80 ఫీట్ రోడ్డుగా విస్తరిస్తున్నట్లు చెప్పారు. విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ప్రతి ప్రాంతంలోని మురికివాడల నుంచి, మాస్టర్ ప్లాన్ రోడ్ల వరకు నిర్దిష్ట ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రధాన కూడళ్ల అభివృద్ధి..

నగరాభివృద్ధిలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అన్ని ప్రధాన కూడళ్లను ఆధునికీకరిస్తున్నట్లు కె.కె.రాజు పేర్కొన్నారు. నియోజకవర్గంలో సత్యం కూడలి, మహారాణి పార్లర్ కూడలి, రైల్వే న్యూకాలనీ జంక్షన్ల అభివృద్ధి, మాధవధార మారియట్ హోటల్ నుంచి సీతమ్మధార అల్లూరి విగ్రహం వరకు 80 ఫీట్ రోడ్డును కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజలకు సౌకర్యవంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి, కె.వి.ఎన్.శశికళ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, పైడి రమణ, కె.పి.రత్నాకర్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, ఏఈ కమలాకర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్లు

అర్ధరాత్రి చక్కర్లు కొడితే చర్యలు

- రాత్రి 12 గంటల తరువాత ఫుడ్ కోర్టులు మూసేయాలి
- క్రైం డీసీపీ నాగన్న
- ద్వారకా క్రైం స్టేషన్ సందర్శన

సీతమ్మధార: అర్ధరాత్రి 2 నుంచి 4 గంటల మధ్యలో రోడ్లపై వాహనాలు కనిపిస్తే సీజ్ చేయాలని క్రైం డీసీపీ నాగన్న ఆదేశించారు. ద్వారకా జోన్ క్రైం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. సిబ్బంది వివరాలు, వారి విధుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకుని పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో డీసీపీ నాగన్న మాట్లాడుతూ రాత్రి 12 గంటల తరువాత ఫుడ్ కోర్టులు ఎక్కడ తెరిచి ఉన్నా.. వెంటనే వాటిని మూసివేయించాలన్నారు. నాలుగు సార్లు ఇలా చేస్తే జీవీఎంసీ అధికారులతో చర్చించి ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేయిస్తామని చెప్పారు. అర్ధరాత్రి 12 నుంచి ఒంటి గంట వరకు జోనల్ సీఐలు, ఎస్‌ఐలు వారి పరిధిలోని లాడ్జీల్లో తనిఖీలు జరపాలని, ఒంటి గంట నుంచి 2 వరకు బీట్స్ చెక్ చేయాలన్నారు. 2 నుంచి 4 గంటల మధ్యలో దొంగతనాలు జరిగే అవకాశమున్నందున రోడ్లపై ఎవరు కనిపించిన స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించారు.

ఊరెళ్తే సమాచారమివ్వండి

క్యాంప్‌లు, వివిధ పనులపై దూరప్రాంతాలకు వెళ్లే వారు సమీప పోలీస్ స్టేషన్‌లో ముందుగా సమాచారమివ్వాలని డీసీపీ సూచించారు. విలువైన వస్తువులను లాకర్‌లో, సన్నిహితుల వద్ద భద్రపరచుకోవాలన్నారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

చైన్ స్నాచర్లు, పెట్రోల్ దొంగలపై నిఘా

వాహనాల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్న వారిలో ఎక్కువ శాతం మైనర్లు ఉంటున్నారని, వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని నాగన్న చెప్పారు. వాకింగ్‌కు వెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు కనిపించకుండా ఉండేలా చూసుకోవాలని, చైన్ స్నాచింగ్ జరిగితే.. నిందితుల బండి నంబర్ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. రాత్రిళ్లు ఇంటి వద్ద పార్క్‌చేసే ద్విచక్ర వాహనాలకు నాణ్యమైన లాక్ వేసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరిగేటప్పుడు తప్పుడు ఫిర్యాదు చేయవద్దని కోరారు.

రాత్రి వేళ అప్రమత్తం

ఆపదలో ఉన్న వారి సహాయార్థం ఏర్పాటు చేసిన డయల్ 100కు కొంత శాతం తప్పుడు కాల్స్ వస్తున్నాయని డీసీపీ అన్నారు. నైట్ బీట్‌లు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళ ఒక క్రేన్ అందుబాటులో ఉండాలని సూచించారు. రాత్రి పూట నగరంలో రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే క్రేన్ ద్వారా ట్రాఫిక్‌ను క్లియర్ చేయవచ్చని చెప్పారు. ద్వారకా క్రైం సీఐ ఇమ్మాని యేల్‌రాజ్, ఎస్‌ఐ నిహార్, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న క్రైం డీసీపీ నాగన్న

వినాయక చవితి ఉత్సవాలకు ముహూర్తపు రాట

సీతంపేట: దేవదాయ శాఖ పరిధి సీతంపేట జంక్షన్‌లోని దుర్గాగణపతి ఆలయ ఆవరణలో శుక్రవారం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట వేశారు. ఆలయ అర్చకుడు నటరాజన్ మంత్రోచ్చారణల మధ్య ముఖ్య అతిథులు 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జగదీశ్వరి దంపతులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ ఈ నెల 18న వినాయక చవితి జరుగుతుందని, ఆ రోజు దుర్గాగణపతి వెండి కవచంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ నెల 26 వరకు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ దుర్గాగణపతికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, హోమాలు, ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. సాయంత్రం రోజుకొక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిస్తారన్నారు. 27న సిద్ధి, బుద్ధి సమేతంగా దుర్గాగణపతి భారీ ఊరేగింపు ఉంటుందని చెప్పారు. ఆలయ ఈవో రమాభాయి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



దుర్గాగణపతి ఆలయం వద్ద రాట వేస్తున్న కార్పొరేటర్ గోవింద్, జగదీశ్వరి దంపతులు

నేత్రదాన ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు

సీతంపేట: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో సీఐఐ యంగ్ ఇండియన్స్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సంయుక్తంగా శుక్రవారం నేత్రదాన ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాయి. రామా టాకీస్ రోడ్డులోని నేత్ర వైద్యశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర ఆల్ ఇండియా రేడియోలో శ్రోతలకు నేత్రదాన ఆవశ్యకతను వివరించారు. శనివారం ఉదయం 7.15 గంటలకు ఈ రేడియో టాక్ ప్రసారమవుతుందని, ప్రజలంతా వినాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు డాక్టర్ త్రిప్తి యెరమిల్లి, రాయ్ కొడాలి, ఆల్ ఇండియా రేడియో ప్రతినిధి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకృష్ణ కథామృత సప్తాహం ప్రారంభం

సీతంపేట: శ్రీకృష్ణుడి అన్ని అవతారాల గురించి గాథలు, విశేషాలు మహద్భాగవతంలో వివరించారని శంకరాచార్య, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం ప్రారంభమైన శ్రీకృష్ణ కథామృత సప్తాహంలో భాగంగా మొదటి రోజు శ్రీకృష్ణుని గాథలపై స్వామీజీ ప్రవచించారు. దశమ స్కందంలో కృష్ణుడి బృందావన విహారం ప్రధాన అంశగా బ్రహ్మవైవర్తన పురాణంలో చెప్పబడిందన్నారు. శ్రీమద్భాగవతంలో ఎక్కడా రాధాదేవి పేరు లేదని, గోపికల గురించి మాత్రమే ప్రస్తావించారన్నారు. బృందావన భాగవతం కృష్ణ లీలా గాథల ప్రస్తావన ఏడు రోజుల పాటు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రవచిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

మహిళ మెడలో గొలుసు చోరీ

తాటిచెట్లపాలెం: రైల్లో ప్రయాణిస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటన శుక్రవారం రాత్రి విశాఖపట్నం రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాతపట్నంకు చెందిన నల్ల కృష్ణవేణి బంధువులతో కలిసి విశాఖపట్నంలో శీమంతం వేడుకలో పాల్గొనేందుకు గుణుపూర్ పాసింజర్ స్పెషల్‌లో వస్తున్నారు. రైలు కంచరపాలెం వద్దకు వచ్చేసరికి వీరు గేట్ దగ్గర వేచి ఉన్నారు. ఈ సమయంలో రైలు నెమ్మదిగా ప్రయాణిస్తుండడంతో ఇదే రైలులో ప్రయాణిస్తున్న మాస్క్ ధరించి ఉన్న ఒక వ్యక్తి ఆమె మెడలో బంగారు గొలుసు తెంచుకొనిపోయాడు. రైలు స్టేషన్‌కు చేరుకున్నాక బాధితులు గవర్నమెంట్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోయిన గొలుసు సుమారు 2 తులాలు ఉంటుందని తెలిపారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

దోమల నిర్మూలనపై అవగాహన

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమలు పెరగకుండా నియంత్రించవచ్చని మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా 25వ వార్డు సీతంపేట, కనకమ్మవారి వీధి, బీటీఆర్ నగర్ ప్రాంతాల్లో దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు ఆయన అవగాహన కల్పించారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలు పరిశీలించారు. గోళాలు, డ్రమ్ముల్లో దోమ లార్వాలను గుర్తించి వాటిని నిర్మూలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షా కాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులు, మనీ ప్లాంట్‌లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్‌బాక్స్‌ను శుభ్రం చేసి మళ్లీ నీరు పట్టుకోవాలని సూచించారు. గోళాలు, కుండీల్లోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో పనికి రాని వ్యర్థాలు, వాడిపారేసిన టీ కప్పులు, ఐస్‌క్రీం కప్పులు, తాగిపారేసిన కొబ్బరి బొండాలు, డ్రింక్ బాటిళ్లు వంటివి లేకుండా చూడాలని చెప్పి కరపత్రాలు పంచారు.



కనకమ్మ వీధిలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

తెలుగు పద్యానికి పూర్వవైభవం

సీతంపేట: పద్యం తెలుగు వారి సాంస్కృతిక ఆస్తని, దానిని కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరిపై ఉందని పద్య శిక్షకుడు కొల్లారపు ప్రకాశరావు శర్మ అన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో స్థిరపడిన ఆయన విశాఖ సాహితి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సభలో «ప్రాచీన పద్య కవిత నుంచి ఆధునిక పద్య కవితా రచన వరకు» అనే అంశంపై ప్రసంగించారు. అమెరికా నుంచి ఇంటర్‌నెట్ ద్వారా నిత్యం ఎంతో మందికి పద్య రచనలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని తెలుగు వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశాఖ సాహితి అధ్యక్షురాలు చార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడినప్పటికీ ప్రకాశరావు శర్మ తెలుగు సాహిత్యంపై ఉన్న అభిమానంతో పద్యానికి పూర్వవైభవం తీసుకురావడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశాఖ సాహితి ఉపాధ్యక్షురాలు కందాళ కనకమహాలక్ష్మి, కార్యదర్శి శంకర్ నీలు, వేదుల కామేశ్వరశర్మ, కొచ్చర్లకోట సత్యనారాయణమూర్తి, తెలుగు సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్య శిక్షకుడు ప్రకాశరావు శర్మ

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మూడో శ్రావణ శుక్రవారం వ్రత పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

'నవరత్నాలు'తో అన్ని వర్గాలకు మేలు

సీతంపేట: ప్రజలకు మంచి చేయాలని అనుక్షణం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లవేళలా అండగా ఉండాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 26వ వార్డు రామకృష్ణానగర్-2 సచివాలయం పరిధిలోని ఎన్జీజీవోస్ కాలనీలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నవరత్నాలు పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్ మేలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకు అతీతంగా అందరికీ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, డైరెక్టర్లు పాండవ శ్రీను, రాయుడు శ్రీను, 26వ వార్డు నాయకులు రేవతీరావు, శేషు, రవిబాబు, బాబ్‌జాన్, నవాబు, అనురాగ్, ఫారూఖీ, ప్రభ, రోయ్, పాల్, పార్టీ కార్యకర్తలు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు అభివాదం చేస్తున్న కె.కె.రాజు

రుక్మిణి, శ్రీకృష్ణుల పంచలోహ విగ్రహాల బహూకరణ



పార్వతీశ్వరాలయానికి బహూకరించిన రుక్మిణి, శ్రీకృష్ణుల విగ్రహాలతో దాతలు గొలుగూరి గంగిరెడ్డి, అనిత

సీతంపేట: సీతంపేటకు చెందిన ఫైనాన్స్ వ్యాపారి గొలుగూరి గంగిరెడ్డి, అనిత దంపతులు పంచలోహాలతో తయారు చేసిన సుమారు రూ.3 లక్షల విలువైన రుక్మిణి, శ్రీకృష్ణుల విగ్రహాలను స్థానిక గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయానికి బహూకరించారు. సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల చేతుల మీదుగా ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మకు శుక్రవారం వాటిని అందజేశారు. ఈ సందర్భంగా విగ్రహ దాతలు మాట్లాడుతూ 125 కిలోల బరువున్న పంచలోహ విగ్రహాలను కుంభకోణంలో తయారు చేయించామన్నారు. అర్చకుడు భాస్కరశర్మ వేద మంత్రోచ్చారణలతో విగ్రహాలకు పంచ సయ్యాది వాసములు నిర్వహించి విగ్రహారాధనకు సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బి.టి.నాయుడు, అప్పలనాయుడు, బాలమురుగన్ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

'అవంతి'లో ఇండియన్ ఐడల్ శ్రీరామచంద్ర సందడి

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ఇండియన్ ఐడల్ శ్రీరామచంద్ర సందడి చేశారు. తాను నటించిన పాపం పసివాడు సినిమా ఓటీటీ వేదిక ఆహాలో ఈ నెలలో విడుదల అవుతున్న సందర్భంగా ప్రమోషనలో భాగంగా ఇక్కడకు వచ్చారు. కొత్త తరహాలో ఉంటున్న ఈ సినిమాలో రెండు పాటలు అందరినీ ఆకట్టుకుంటాయని శ్రీరామచంద్ర అన్నారు. ఈ సందర్భంగా తన పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శ్రీరామచంద్రను సత్కరించారు.



పాట పాడుతున్న సింగర్ శ్రీరామచంద్ర

వైభవ వెంకన్నకు సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.